Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..






# ప్రధాని మోదీకి నీరా 'జనం'

- మీర్జాలగూడ టు మల్కాజ్గిరి
- మల్కాజిగిరి నియోజకవర్గంలో మోదీ రోడ్ షో సక్సెస్
- 1.2 కిలోమీటర్లు కొనసాగిన రోడ్ షో
- కాషాయమయంగా మారిన మల్కాజిగిరి రోడ్లు
- రోడ్ షోలో పాల్గొన్న కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్
- ఔర్‌ఏక్‌బార్‌మోదీ సర్కార్ అంటూ నినాదాలు
- అభిమానులతో కిక్కిరిసిపోయిన అపార్ట్‌మెంట్లు, మిద్దెలు
- మోదీకి అఖండ హారతులు ఇచ్చిన మహిళలు, దారిపొడవునా మోదీపై పూలవర్షం
- ఓపెన్ టాప్‌వాహనంలో కాషాయరంగు టోపీతో ఆకర్షణీయంగా కనిపించిన ప్రధాని మోదీ
- కార్యకర్తల్లో సరికొత్త ఉత్సాహం నింపిన రోడ్ షో






**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు.. శుక్రవారం మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో మోదీ రోడ్‌షో అశేష జనవాహిని మధ్య విజయవంతమైంది. ఈ సందర్భంగా మోదీకి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. కాషాయ రంగు టోపీ ధరించిన మోడీ ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి రోడ్డుకు ఇరువైపులా ఉన్న జనానికి అభివాదం చేస్తూ... ప్రజలకు షేక్ హ్యాండ్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ విజయ సంకల్ప యాత్ర నేపథ్యంలో మల్కాజిగిరి, మీర్జాలగూడ వీధులు కాషాయమయం అయ్యాయి. బీజేపీ జెండాలు, కండువాలతో భారీ ఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. వారందరికీ అభివాదం చేస్తూ మోదీ ముందుకు సాగారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రధాని మోదీ రోడ్ షోలో ఆయన వెంట వాహనంపై కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ ఉన్నారు. తొలుత మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు ప్రధాని నరేంద్ర మోదీ విజయ సంకల్ప యాత్ర ప్రారంభమైంది. బీజేపీ కార్యకర్తలను హుషారెత్తించేలా మోదీ రోడ్ షో సాగింది. దారిపొడవునా కార్యకర్తలు, అభిమానులు మోదీపై పూలవర్షం కురిపించారు. భారీగా తరలివచ్చిన బీజేపీ కార్యకర్తలు మోదీ.. మోదీ.. మోదీ.. అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. జై భారత్, జై జై మోదీ, ఔర్‌ఏక్‌బార్‌మోదీ సర్కార్ అంటూ మల్కాజిగిరి ప్రజలు నినాదాలు చేయడం విశేషం.

02

# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

దిల్లీ మద్యం కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ఉదయం నుంచి సుదీర్ఘ సోదాల అనంతరం ఈడీ అధికారులు కవితను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. కవిత అరెస్టుపై ఆమె సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఈడీ అధికారులు ప్రీవెన్సన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ – పీఎంఎల్ యాక్ట్ ద్వారా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం. 5.20 గంటలకు అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ పేరుతో అరెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు.

02

# అత్యంత పారదర్శకంగా గురుకుల బోర్డు నియామకాలు

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

గురుకుల బోర్డు ద్వారా జరిగిన నియామాకాలు 100% పారదర్శకంగా, నిబద్ధతతో జరిగాయని, ఈ విషయంలో వివిధ మాధ్యమాలలో వస్తున్న వార్తలు అభ్యర్థులను తప్పు ద్రోవ పట్టించే విధంగా ఉన్నాయని TREIRB చైర్మన్ ఆయేషా మసరత్ ఖానం వెల్లడించారు. అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా డి ఎల్ మరియు జే ఎల్ ఫలితాలను ఇవ్వటం జరిగిందని అన్నారు.. డి ఎల్, జే ఎల్ 1:2 లిస్టును ఫిబ్రవరి 15, 16వ తేదీలలో వెబ్ సైట్ నందు పొందుపరచటం జరిగింది. డెమో తేదీలను కూడా అదే రోజు ప్రకటించి ఫిబ్రవరి 19 నుండి 22 వరకు డెమోలను కండక్ట్ చేయటం జరిగింది. డెమోలను కండక్ట్ చేయగానే వెంటనే ఫలితాలను ఫిబ్రవరి 28వ తేదీ డి ఎల్ ఫలితాలను 29వ తేదీన జే ఎల్ ఫలితాలను ప్రకటించామని వివరించారు.. ఎటువంటి అనుమానాలకు తావివ్వకుండానే మార్చి 4వ తేదీన వెంటనే అభ్యర్థులకు నియామక పత్రాలను అందించడం జరిగిందని, అమలులో ఉన్న నిబంధనల మేరకు అన్ని రిజర్వేషన్లు పాటించి పారదర్శకంగా ఎంపికలు జరిపామని తెలియ చేశారు.. అభ్యర్థులకు ఏవిధమైన ఇబ్బంది కలుగకుండా నియామకాల ప్రక్రియ మొదలు పెట్టిన అతి తక్కువ కాలంలోనే ఫలితాలను ప్రకటించామని ఐషా మసరత్ ఖానం వెల్లడించారు. మధ్యవర్తులను పైరవికారులకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా నిర్వహించడం జరిగిందన్నారు. నోటిఫికేషన్ నెం.02/2023, తేదీ: 05.04.2023 ప్రకారం పారా–XI(ఎ) నందు మార్కుల గురించి తెలిపామని, మార్కుల మేమోలను నెల రోజుల తర్వాత నుండి 90 రోజుల వరకు ట్రిబ్ వెబ్ సైట్ ద్వారా పొందుటకు అవకాశం ఉంటుందని అన్నారు.. అర్హులైన అభ్యర్థులకు మాత్రమే ఆన్ లైన్ ద్వారా రూ.200 పే చేస్తే మార్కుల మేమో ఇస్తామని డి ఎల్ మరియు జే ఎల్ లు మల్టీజోను స్థాయి పోస్టులను నిబంధనల మేరకు రిజర్వేషన్ పద్ధతి ఆయా గురుకుల సంస్థలు ఇచ్చిన ఇన్ డెంట్ ను పాటించి ఎంపిక చేయడం జరిగిందని తెలియచేసారు. డెమో నియమ నిబంధనలను పాటించనని వారికి గైడ్ లైన్స్ ఇవ్వటం జరిగింది. దానిలో సమయము పరిశీలించాల్సిన వివిధ అంశాలను కూడా పేర్కొనడం జరిగిందన్నారు.వైట్ బోర్డులు, మార్కర్ పెన్నులు, డెమోకు అవసరమైన వాటిని ప్రతి బోర్డులో అందుబాటులో ఉంచడమైనది. ఏ బోర్డులో ఎవరు ఉంటారనే విషయాన్ని, ఏ అభ్యర్థులు ఏ బోర్డుకు వెళ్తారనే అంశాన్ని చివరి నిమిషాన నిర్ణయించటం జరిగింది. అభ్యర్థుల వ్యక్తిగత వివరాలను తెలుపకుండా కేవలం హాల్ టికెట్ల నెంబర్లను మాత్రమే బోర్డుకు అందించడం జరిగింది. నోటిఫికేషన్ నెం.02/2023, తేదీ: 05.04.2023 ప్రకారం సారా–V(1)లో జీ.ఓ.ఎమ్.ఎస్.నెం.81, 1997 ప్రకారము వెయిటింగ్ లిస్టు విధానము లేదు అని భర్తీ కాని, జాయినింగ్ కాని ఖాళీలు క్యారిఫార్వడ్ చేసి రాబోయే నోటిఫికేషన్ ద్వారా నింపుతామని TREIRB చైర్మన్ ఐషా మసరత్ ఖానం, ఐఏఎస్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక

- అటవీ, పర్యాటక శాఖ కలిసి పని చేయాలి
- ఉద్యోగుల సాధారణ బదిలీలపై వేసవిలోనే నిర్ణయం
- కాలుష్యం లేని పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
- ఐఎఫ్ఎస్ ల ఖాళీల భర్తీకి కేంద్రానికి విజ్ఞప్తి
- అటవీ శాఖ సమీక్ష లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ, పర్యాటక శాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా వైవిధ్యమున్న ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. రెండు విభాగాలు సంయుక్తంగా పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. అటవీ అందాలు, వన్య ప్రాణులు, వలస వచ్చే విదేశీ పక్షులు, విభిన్న జీవ వైవిధ్యమున్న ప్రాంతాలు, హెరిటేజ్ ప్రదేశాలు, సంస్కృతికి అద్దం పట్టే ప్రాంతాలన్నింటినీ గుర్తించి, వాటిని అభివృద్ధి చేయాలని అన్నారు. తెలంగాణలో అడవులతో ముడిపడి ఉన్న ప్రకృతి అందాలను, పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా ప్రతిపాదనలు రూపొందించాలని, అందుకు అవసరమైన కృషి చేయాలని అన్నారు. అవసరమైతే ప్రత్యేకంగా కన్సల్టెన్సీలను నియమించి ప్రతిపాదనలు తయారు చేయించాలని చెప్పారు. ఉత్తర తెలంగాణలో కవ్వాల్, దక్షిణ తెలంగాణ వైపు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. వన్య ప్రాణులకు హాని కలిగించకుండా ప్రత్యేక పర్యాటక విధానం తయారు చేయాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అటవీ ప్రాంతాల్లోనే పర్యాటకులు విడిది చేసేలా ప్రాజెక్టులు కూడా ఉన్నాయని, వాటిని అధ్యయనం చేసి, అక్కడ అనుసరిస్తున్న రక్షణ, భద్రత చర్యలను రాష్ట్రంలోనూ అమలయ్యేలా చూడాలని చెప్పారు.

02

# ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచుకోవాలి

– డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

రాష్ట్ర ఆదాయ వనరులు పెంచుకోవడం & వనరుల నిర్వహణ పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సభ్యులైన , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావువులు, సిఎస్ శాంతి కుమారి, స్పెషల్ సిఎస్ రామకృష్ణారావు, హెచ్ఎండిఏ కమిషనర్ దాన కిషోర్, సి సి ఎల్ ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆదాయం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పోకుండా చూడాలని సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. పేదవాడి పై భారం పడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచుకునేలా రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం సమావేశంలో ఆదేశించారు.

@ రాష్ట్ర ఆదాయం పెంచేందుకు ప్రతివారం సమీక్ష సమావేశం నిర్వహించాలని గత సమావేశంలో చర్చించిన అంశాల్లో ప్రగతిని నివేదించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

02

# న్యాయసేవా సర్వీసులపై అవగాహనకు పది లఘు చిత్రాలను ప్రారంభించనున్న హైకోర్టు సి.జె



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గాను రూపొందించిన పది లఘు చిత్రాలను హై- కోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే రేపు, శనివారం నాడు, ఆవిష్కరించనున్నారు.అందరి చెంతకు న్యాయ సేవలు చేరడంద్వారా మెరుగైన జీవనాన్ని గడిపేందుకు ఉద్దేశ్యంతో జాతీయ లీగల్ సెల్ అథారిటీ రూపొందించిన ఈ పది లఘు చిత్రాలను బంజారా హిల్స్ లోని ప్రసాద్ లాబ్స్ లో హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి శనివారం నాడు ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి పలువురు హై–కోర్ట్ న్యాయ మూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలంగాణ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎస్. గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేసారు.

# మోదీకి నీరా'జనం'

మొదటి పేజీ తరువాయి

దీంతో మీర్జాలగూడ, మల్కాజిగిరి వీధులు మోదీ నినాదాలతో మార్మోగాయి. మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి క్రాస్ రోడ్డు వరకు దాదాపు 1.2 కిలోమీటర్ల మేర రోడ్ షో కొనగింది. మల్కాజిగిరిలో ఎక్కడ చూసినా అశేష జనవాహినితో రోడ్లన్నీ కాషాయమయంగా మారాయి. రోడ్ షోలో మోదీతో పాటు 5 లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు పాల్గొన్నారు. మోదీని చూసేందుకు అపార్ట్‌మెంట్లు, మిద్దెలు ఎక్కిన జనంతో కిక్కిరిసిపోయాయి. మోదీని చూసి అశేష జనవాహిని పులకించిపోయింది. తమ అభిమాన నేతపై భవనాల పైనుంచి పూలవర్షం కురిపించారు. మహిళల మంగళహారతులు దారిపొడవునా మహిళలు హారతులు ఇస్తూ కనిపించారు. ఆరేళ్ల చిన్నారులనుంచి వృద్ధుల వరకూ వయసును కూడా లెక్కచేయక మోదీ రాక కోసం నిరీక్షిస్తూ కనిపించారు. మోదీని చూడగానే ఒక్కసారిగా వాళ్ల కళ్లలో అలసట మాయమైపోయింది. నెల రోజులుగా వరుస పర్యటనలతో ఉన్న మోదీ మొహంలో ఎలాంటి అలసట కనిపించకపోవడం విశేషం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో చాలా చురుగ్గా ఉంటారు. ఏ మాత్రం అలసిపోకుండా చాలా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ఏకధాటిగా కొన్ని గంటలపాటు ప్రయాణం చేసినా.. వరుసగా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినా ప్రధాని మోదీ అలసటను మాత్రం దరిచేరనియరు. అందుకే ఆయన ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నాయకుల్లో ఒకరిగా ఎదిగారని అభిప్రాయపడుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలలో.. బిజీ షెడ్యూల్ ఉన్నా.. ఆయన అలసటను మాత్రం దరిచేరనీయరు. రోడ్ షో సందర్భంగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పలు రోడ్లలో ట్రాఫిక్ ను మళ్ళించారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో పోలీసు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

**నేడు నాగర్ కర్నూల్ కు మోదీ :**

ప్రధాని మోదీ శనివారం ఉదయం11 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ లో నాగర్ కర్నూల్ కు బయల్దేరతారు. పీఎం 11.45 నుంచి 12.45 గంటల వరకు నాగర్ కర్నూల్ లో బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నాగర్ కర్నూల్ నుంచి హెలికాప్టర్ లో గుల్బర్గా వెళ్తారు. అక్కడి నుంచి ఢిల్లీకి తిరుగి వెళ్తారు.

**ప్రధాని రోడ్ షో ఏర్పాట్లను పర్యవేక్షించిన కిషన్ రెడ్డి**

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం మల్కాజిగిరిలో నిర్వహించిన రోడ్ షో విజయవంతమైంది. ప్రధాని రోడ్ షో కు మూడు రోజుల ముందు నుంచే రాష్ట్రపార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రత్యక్షంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కిలోమీటర్ల పొడవున మిర్జాల్ గూడ నుంచి మల్కాజిగిరి వరకు సాగిన రోడ్ షో కోసం మధ్యాహ్నం నుంచే కిషన్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాని రోడ్ షో జరిగే దారి పొడవునా కాలినడకన తిరుగుతూ ఇరువైపులా ప్రధాని కోసం వేచి ఉన్న ప్రజలతో మాట్లాడారు. చిన్నారులు, మహిళలను పలుకరిస్తూ ఉత్సాహపరిచారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

# ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచుకోవాలి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ లోపట పరిసరాల్లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తతో ఉండాలని, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు కాపాడటమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. సహజ వనరు ఇసుక ద్వారా ఆదాయం పెంచుకోవడమే కాదు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత కాలంలో ఉన్న ఇసుక పాలసీని ప్రస్తుతం కొనసాగుతున్నప్పటికీ ఇసుక ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి అన్న ప్రచారం జరగడం వెనుక కారణాలు విశ్లేషించి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక బహిరంగ వేలం నిర్వహించాలని, వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఇసుక అందుబాటులో ఉంచాలని, ఇసుక కోసం ప్రైవేటు వ్యక్తుల వద్దకు వెళ్లాల్సిన పని లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో గృహ నిర్మాణం ఇతర రంగాల్లో ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ లీజులను సమీక్షించి లీజు ఛార్జీలు పెంచే కసరత్తు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా హెచ్ఎండిఏ, ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, పర్యాటక రంగంలో ఉన్న లీజులను సమీక్షించాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాలపై దృష్టి పెట్టాలని హెచ్ఎండిఏ అధికారులకు సూచించారు. ఈ ప్రాంతాల్లో వివిధ విభాగాల ద్వారా సమన్వయం చేసుకొని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ పథకానికి వచ్చిన దరఖాస్తులు వాటి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో గతంలో భూమ్ రావడానికి కారణాలు, ప్రస్తుతం అంగం పరిస్థితిని సమీక్షించారు.

@ మద్యం తయారు చేసే పరిశ్రమల నియంత్రణ, ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో నమోదవుతున్న స్టాక్, మార్కెట్లోకి వచ్చినప్పుడు ఉన్న స్టాకు వ్యత్యాసాలను ఎలా గుర్తిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. నాన్ డ్యూటీ లిక్కర్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా తీసుకుంటున్న చర్యలను ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని డిప్యూటీ సీఎం వివరించారు. ఇతర రాష్ట్రాల్లో మద్య ధరలు, మన రాష్ట్రంలో మద్యం ధరలకు వ్యత్యాసం పై సమీక్షించారు. కల్తీలను నివారించేందుకు ప్రత్యేక హోలోగ్రామ్స్ తో సెక్యూరిటీ వ్యవస్థ, సరిహద్దుల్లో చెక్ పోస్టులు పెంచడం తదితర అంశాలపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోనే మద్యం తయారుచేసి పన్ను చెల్లించడం లేదా, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా మూలంగా రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం పై ప్రభావం పడుతుందా తదితర అంశాలను మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సామాన్యుడు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మట్టి తరలించే క్రమంలో పోలీసులు, మైనింగ్ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ అంశంలో జాగ్రత్తగా వివరించాలని అధికారులకు మంత్రులు ఉత్తమ్, జూపల్లి లు సూచించారు.

రాష్ట్రంలో లైమ్ స్టోన్ ఖనిజాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో మాంగనీసు అందుబాటులో ఉంది ఇలా ఇతర జిల్లాల్లోనూ అందుబాటులో ఉన్న ఖనిజాల వివరాలు సేకరించి ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. గోదావరి నుంచి ఇసుక తరలించే క్రమంలో ఒకే బిల్లుపై మూడుసార్లు అధిక లోడుతో ఇసుక తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి ఒక శాతం ఆదాయం ఇస్తుంటే స్థానికంగా రహదారులు ప్రజల ఆరోగ్యం మూడు రెట్లు దెబ్బతింటుంది ఈ వ్యవస్థను నియంత్రించాలని మైనింగ్ శాఖ అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి ప్రతి రీచ్ లో సీసీ కెమెరాలు, ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, ఇసుక రవాణా చేసే వాహనాల ట్రాకింగ్ వ్యవస్థను ఆచరణలో పెట్టి పకడ్బందీగా అమలు చేయాలని తద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగడంతో పాటు సామాన్యులకు ఇసుక అందుబాటులోకి వస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ వాహనాలపై ఇప్పుడే పనులు విధించే ఆలోచన విరమించుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ వాహనాల ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలు క్రమంగా మన రాష్ట్రంలోకి వస్తున్నాయి ఈ క్రమంలో పనుల భారం మోపితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ఉపాధిపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది అని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు తెలిపారు. జీవో నెంబర్ 188 పరిధిలో కాలనీలా రిజిస్ట్రేషన్, సింగరేణి కార్మికుల కాలనీల రిజిస్ట్రేషన్ తద్వారా ప్రభుత్వానికి సమకూరే ఆదాయం గురించి మంత్రి శ్రీధర్ బాబు అధికారులతో సమీక్షించారు.

# గల్ఫ్‌లో ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు రూ. 5 లక్షల సాయం

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**



వంద రోజుల ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గల్ఫ్ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గల్ఫ్ లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేసియాను అందించింది. ఇటీవల సౌదీలో రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయిన రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేటకు చెందిన బొడ్డు బాబు మూడు నెలల కిందట బైరన్లో ప్రమాదవశాత్తూ చనిపోయాడు. బతుకుదెరువుకు గల్ఫ్ వెళ్లిన బాబు చనిపోవటంతో ఆ నిరుపేద కుటుంబానికి దిక్కులేకుండా పోయింది.

వేములవాడ రూరల్ మండలం మర్రిపెల్లికి చెందిన 28 ఏళ్ల శశికుమార్ కూడా డిసెంబర్ నెలలో సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంతో చనిపోయారు. పెద్దదిక్కును కోల్పోవటంతో ఆయన భార్య, పిల్లలు తల్లడిల్లిపోయారు.

ఎలాగైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు ఇటీవలే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను కలిసి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇటీవలే ఆది శ్రీనివాస్ ఈ విషయాన్ని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే ఆ కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో వేములవాడ నియోజకవర్గానికి చెందిన శశికుమార్, బాబు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

"ఎంఎల్‌సీ కవిత.. మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం –2002 కింద శిక్షార్హమైన నేరానికి పాల్పడ్డారని విశ్వసించేందుకు నా వద్ద కారణాలు ఉన్నాయని ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న జోగేందర్ అనే నేను తెలియ జేస్తున్నాను. మనీ ల్యాండరింగ్ చట్టం లోని సెక్షన్ 19 లోని సబ్ సెక్షన్(1) కింద నాకు ఉన్న అధికారాల మేరకు ఎంఎల్‌సీ కవితను అరెస్ట్ చేస్తున్నానని తెలియ జేస్తున్నాను.సాయంత్రం 5 గంటలకు అరెస్ట్ చేశాం. అరెస్టుకు గల కారణాలను వివరిస్తూ 14 పేజీలతో కూడిన రిపోర్టును కవితకు అందజేశాం." అని నోటీసులో పేర్కొన్నారు. అరెస్టుపై స్పందించిన కవిత, ఆమె కుటుంబ సభ్యులు ఈడీ అధికారులతో సంపూర్ణంగా సహకరిస్తామని తెలిపారు. ఈ అరెస్టును అక్రమ అరెస్టుగా అభివర్ణించిన గులాబీ నేతలు న్యాయ పరంగా, శాంతి యుతంగా, ప్రజాస్వామ్య యుతంగా ఎదుర్కొంటామని అన్నారు. కవిత తరలింపునకు ఆటంకాలు లేకుండా రోప్ పార్టీ ఏర్పాట్లు చేశారు. అరెస్టుని అడ్డు కోవద్దని, పార్టీ కార్యకర్తలు శాంతియుతంగా వ్యవహరించాలని కోరిన కేటీఆర్, హరీష్ రావు, ఇతర పార్టీ సీనియర్ నాయకులు అన్నారు.కవిత అరెస్టుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఆమె ఇంటి వద్దకు భారీగా పోలీసు బలగాలను మోహరించారు. అరెస్టుపై ఈడీ జేడీ భాను ప్రియ మీనాతో కేటీఆర్ కు వాగ్వాదం జరిగింది. దీంతో, కేటీఆర్ కు ఈడీ జేడీ మీనా అరెస్ట్ వారెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవితను కాసేపట్లో దిల్లీకి తరలించ నున్నారు.శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి విస్తారా ఫ్లైట్ లో రాత్రి 8:45 నిమిషాలకు కవితను దిల్లీకి తీసుకెళ్ల నున్నారు..

# ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం సచివాలయంలో అటవీ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్ర శేఖర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అటవీ శాఖలో నుంచి డిప్యుటేషన్ పై వెళ్లి ఇతర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను వెంటనే సమర్పించాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే వెంటనే వారిని వెనక్కి రప్పించే చర్యలు చేపడుతామని చెప్పారు. ఏళ్లకేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగుల బదిలీ చేయాలని, అందుకు వీలుగా బదిలీలపై నిషేధం ఎత్తివేయాలని అధికారులు సమావేశంలో సీఎం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి పార్లమెంట్ ఎలక్షన్లు ఉన్నందున, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బదిలీల ప్రక్రియపై నిర్ణయం తీసుకుందామని అన్నారు. ఉద్యోగుల పిల్లల చదువులకు కూడా ఇబ్బంది లేకుండా వేసవి లోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తే బాగుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఒక్క అటవీ శాఖలోనే కాకుండా అన్ని విభాగాల్లోనూ ఏళ్లకేళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేసేలా సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు కూడా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలుష్య నిబంధనలు, ప్రమాణాలను పాటించే పరిశ్రమలను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి ఏడాది పర్యావరణ దినోత్సవం లాంటి సందర్భాన్ని పురస్కరించుకొని జీరో పొల్యూషన్ పాటించే సంస్థలకు ప్రశంసా పత్రాలను అందించాలని చెప్పారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం నగరాలకు అందుబాటులో ఉండేలా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, ఎక్కడ అనువైన ప్రాంతాలున్నాయో పరిశీలించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ తయారు చేసే పరిశ్రమలకు నోటీసులు ఇవ్వాలని, భారీగా జరిమానాలు విధించాలని చెప్పారు. రాష్ట్రానికి మంజూరైన 81 మంది ఐఎఫ్ఎస్ పోస్టుల్లో ప్రస్తుతం 55 మంది మాత్రమే ఉన్నారని, మిగతా 26 ఐఎఫ్ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చర్చ జరిగింది. ఖాళీలు లేకుండా సరిపడే సంఖ్యలో ఐఎఫ్ ఎస్ లను కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని నర్సరీల్లో దాదాపు 22 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. జూన్ లో వర్షాకాలం ఆరంభంలో వీటిని నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అడవుల్లో చెట్ల నరికివేతతో ఖాళీ అయిన ప్రాంతాల్లో మొక్కలు పెంచాలని, అవసరమైతే అక్కడే బోర్లు వేయించి నీరు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆక్రమణకు గురవుతున్న ఫారెస్ట్ ల్యాండ్ ల చుట్టూ కాంపౌండ్ వాల్ లేదా ఫెన్సింగ్ వేసి కాపాడే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే కాంపా నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఎల్బీ స్టేడియంలో ఘనంగా ఇఫ్తార్ విందు

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

రంజాన్ మాసం సందర్భంగా ఎల్బీ స్టేడియంలో ముస్లిం సోదరులకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసింది. ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, షబ్బీర్ అలీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 12 నుండి ప్రారంభమయ్యాయి. ఒక నెలపాటు ఉపవాసం ఉండి అల్లాను ప్రార్థిస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొమ్మిదో నెలను రంజాన్ నెల అంటారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఆధ్యాత్మిక ప్రార్థనలకు ఎక్కువ సమయం కేటాయిస్తారు.








# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ ను ఖండిస్తున్నాం

**- ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

లోకసభ ఎన్నికల ముందు భారత రాష్ట్ర సమితిని మానసికంగా దెబ్బ తీయాలనే ఆలోచన తో రాజకీయ కుట్ర తో ఎన్నికల నోటిపికేషన్ వెలువడే సమయంలో అరెస్టు చేయడం పూర్తిగా అప్రజాస్వామిక చర్య రాజకీయ కుట్ర లో భాగంగా కవిత అరెస్టును నిరసిస్తూ రేపు ఉదయం 11 గం.కు నియోజకవర్గ కేంద్రంలో నిరసన కార్యక్రమం ఉంటుంది.భారత రాష్ట్ర సమితి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాలొని అక్రమ అరెస్టును ఖండించాల్సింది గా కోరుతున్నాను.బారాసా శ్రేణులు ఉ.10.30 ని.కు ఘనపూర్ నియోజకవర్గ కేంద్రం లో పార్టీ కార్యాలయం కు రావాల్సింది గా కోరుతున్నాను.

# అడ్మిరల్ లక్ష్మీనారాయణ్ రాందాస్ మృతిపై సీఎం సంతాపం

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**



విశ్రాంత నౌకా దళాధిపతి అడ్మిరల్ లక్ష్మీనారాయణ్ రాందాస్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. 16 ఏళ్ల వయస్సులోనే 1949లో సంయుక్త సైనిక దళాల్లో చేరిన అడ్మిరల్ లక్ష్మీనారాయణ్ రాందాస్ తర్వాత నౌక దళంలో చేరి అంచెలంచెలుగా ఆ దళాధిపతిగా ఎదిగారని ముఖ్యమంత్రి తెలిపారు. 1971 ఇండియా–పాకిస్తాన్ యుద్ధ సమయంలో (బంగ్లాదేశ్ విమోచన యుద్ధం) తూర్పు నౌకా దళంలో ఏర్పాటు చేసిన ఐఎన్ఎస్ బియాస్‌కు నాయకత్వం వహించిన అడ్మిరల్ లక్ష్మీనారాయణ రాందాస్ పాకిస్థాన్‌కు చెందిన 93 వేల మంది సైనికులు తప్పించుకొని పోకుండా చేసి వారు లొంగిపోయేలా చేసిన తీరును ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ యుద్ధ సమయంలోనే పాకిస్తాన్ నుంచి తూర్పు పాకిస్థాన్ కు(ప్రస్తుత బంగ్లాదేశ్) నిషిద్ధ వస్తువులను తరలిస్తున్న పలు నౌకలను ఆయన సారధ్యంలోని ఐఎన్ఎస్ బియాస్ అడ్డుకుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అడ్మిరల్ రాందాస్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతి తెలిపారు.

# ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై బీఎస్పీ స్పందన

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**




బిఆర్ఎస్ చీఫ్ మరియు మాజీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు కూతురు, బిఆర్ఎస్ ఎంఎల్సీ కల్వకుంట్ల కవిత ని మోడీ ప్రభుత్వం ఈడీనీ అడ్డంపెట్టుకొని చేసిన అక్రమ అరెస్ట్ ఒక బూటకం. దీన్ని బీఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. కేసీఆర్ తెలంగాణలో బీజేపీ కుటిల ఎత్తుగడలకు తలొగ్గకుండా, విశాల తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వారితో ఎన్నికల పొత్తుకు సమ్మతించకుండా, అదేస్థాయిలో ఉన్న బిజెపి–కాంగ్రెస్ వ్యతిరేక లౌకిక జాతీయ పార్టీ అయిన బీఎస్పీ తో పొత్తుకు చేతులు కలిపిన కొన్నిగంటల్లోనే మోడీ బ్లాక్మెయిల్ పాలిటిక్స్ కు తెర తీశాడు. ఇది ముమ్మాటికీ అప్రజాస్వామికం. ఇది తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవంపై దెబ్బకొట్టడం తప్ప మరొకటి కాదు. ఈ లాంటి అక్రమ అరెస్ట్ ల తో అదిరేది బెదిరేది లేదు. బెదిరితే తెలంగాణ వచ్చేదా కాదు. ఈ దుశ్చర్య కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాలను నడుపుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుదుర్చుకున్న లోపాయకారి ఒప్పందంలో భాగమే.ఈడీ తో బిజెపి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేయించిన ఈ అక్రమ అరెస్ట్ ను తమ ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావించి ఈ రెండు దోపిడీ దొంగల పార్టీలకు రేపు జరగబోతున్న భారత పార్లమెంట్ ఎన్నికల్లో తిరగబడి తగిన బుద్ధి చెప్పబోతున్నారు.దేశంలో మోడి పాలన నాటి నాజీల నియంతృత్వం కన్నా ఘోరంగా ఉంది. మొన్న సాయిబాబా సిసోడియా, నిన్న హేమంత్ సోరెన్, నేడు కల్వకుంట్ల కవిత, రేపు నువ్వో నేనో...?అందుకే తెలంగాణ సమాజం, యావత్తు దేశం బీజేపీని తక్షణమే తిరస్కరించాల్సిన అవసరం ఉంది.

# ఎమ్మెల్సీ కవిత అరెస్టు పై కేటీఆర్ స్పందన...



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :**

పదేళ్ల బిజెపి పాలనలో రాజకీయ ప్రత్యర్థులపైన కక్ష సాధింపు చర్యల కోసం అధికార దుర్వినియోగం, రాజ్యాంగ వ్యవస్థల దురుపయోగం చేయడం సర్వసాధారణంగా మారింది.ఈరోజు ఈడి ప్రదర్శించిన తొందరపాటు దుందుడుకు చర్యలపై సుప్రీంకోర్టుకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.కవిత అరెస్టు విషయం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఈడి వ్యవహరించిన తీరుపైన రేపు సుప్రీంకోర్టు కు సమాధానం చెప్పాల్సి వస్తుంది. కచ్చితంగా 19వ తేదీన జరిగే సుప్రీంకోర్టు విచారణలో ఈ అంశం పరిగణలోకి వస్తుందని ఆశిస్తున్న ఈడి స్వయంగా సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీని (అండర్ టేకింగ్) ను తుంగలో తొక్కి ఈరోజు అరెస్టు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.కచ్చితంగా న్యాయం గెలుస్తుంది. చట్టబద్ధంగా ఈ అంశంలో పోరాటం కొనసాగిస్తాం.



తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేల్చుదాం..

# హైదరాబాద్

## దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి - ఏ ఐ వై ఎఫ్ కె. ధర్మేంద్ర

తెలంగాణవీణ, కాప్రా




హైదరాబాద్ లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా, అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) ఆధ్వర్యంలో ఎటువంటి ధర్నా, ముట్టడి కార్యక్రమాలు ఇవ్వకపోయినా నాచారం పోలీసులు అక్రమంగా ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర ను అరెస్ట్ చేసి నాచారం ఠాణాకు తరలించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర మాట్లాడుతూ నాచారం పోలీసులు దురుసు ప్రవర్తన, అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. అరెస్ట్ చేయడానికి వచ్చిన నాచారం పోలీస్ స్టేషన్ గౌరవ కానిస్టేబుల్ జే. సుదర్శన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ ను పక్కన పెట్టి,అసభ్యంగా మాట్లాడటం బాధాకరమన్నారు. వాస్తవానికి ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎటువంటి ధర్నా పిలుపులు ఇవ్వలేదని చెప్పినా సదరు కానిస్టేబుల్ వినకుండా దురుసుగా మాట్లాడటం సరికాదన్నారు. కమ్యూనిస్ట్ వాదులమైన తాము రాజ్యాంగ సూత్రాలకు లోబడే ఉంటామని, అటువంటి యువజన సంఘంలో బాధ్యతలలో ఉన్న మా పట్ల పోలీసులు కనబర్చిన తీరు సరికాదని, గౌరవ కానిస్టేబుల్ పై విచారించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మోడీ పర్యటన అంటూ విచ్చలవిడి అక్రమ అరెస్టులు చేయడం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన చర్యేనని వారు ధ్వజమెత్తారు.అక్రమ అరెస్టు ను ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలని వారు అన్నారు. మోడీ నిరంకుశ విధానాలు దేశానికి నష్టమని, మూడోసారి ప్రధానమంత్రిగా కావాలనే మోడీ కి దేశ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వారు అన్నారు.
బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి కి వస్తున్న నేపథ్యంలో కేవలం బీజేపీ కార్యకర్తలు మాత్రమే పాల్గొనే కార్యక్రమానికి, రాష్ట్రంలో ఉన్న యువజన సంఘాలను, ప్రజాస్వామిక వాదులను పోలీసుల ద్వారా అక్రమ అరెస్టులు, నిర్బంధాలను సృష్టించడం దుర్మార్గమన్నారు. ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు సామరస్యంగా జీవిస్తున్న ఈ దేశంలో ఇలాంటి చట్టం తీసుకురావడం సరికాదని అన్నారు. కేంద్రంలోని కాషాయ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ, లౌకిక విలువలకు తూట్లు పొడిచే వినాశకర చర్యకు పూనుకుందని. మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్న మోదీ సర్కార్ మరో ముందడుగు వేసి లోక్ సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ (సవరణ) చట్టం-2019ను అమలు చేస్తున్నట్లు ప్రకటించడం అహేతుకమైన చర్య అని అభివర్ణించారు. సీ ఏ ఏ చట్టం 'వివక్షత'తో కూడినదని అన్నారు. మత-విభజన చట్టాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని వారు తెలిపారు. అమెరికా, యూరప్ దేశాలు సిఏఏ ను రద్దు చేయాలని సూచించినప్పటికీ మోడీ విరుద్ధంగా దేశ ఐక్యతను దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ చేసిన నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాచారం డివిజన్ కార్యదర్శి కృపాకర్, ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు పాల్గొన్నారు.

## టి ఎక్స్ హాస్పిటల్స్ లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం ముఖ్య అతిథి ప్రముఖ నటి శ్రేయ శరణ్






తెలంగాణవీణ,ఉప్పల్

ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని టి ఎక్స్ హాస్పిటల్స్ ప్రాంగణం నుండి కె.బి ఆర్ పార్క్ వరకు ఉద్యోగులు, వైద్యులు స్థానిక వాస్తవ్యులు తో భాగస్వామ్యమై వాకథాన్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం కిడ్నీ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం కిడ్నీ ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించడం.
ఈ గొప్ప కార్యక్యమానికి టి ఎక్స్ హాస్పిటల్స్ వారు ప్రఖ్యాత సెలబ్రిటీ నటి శ్రేయా శరణ్ నీ ముఖ్య అతిథిగా స్వాగతం పలికారు, శ్రేయ శరణ్ కార్యక్రమానికి హాజరై వారి విలువైన నివారణ చిట్కాలను అందిస్తూ ఆరోగ్యకరమైన మూత్రపిండాలను వాటి యొక్క ఆవశ్యకతను వివరించారు.

విశిష్ట వైద్య నిపుణులు ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్టులు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ శశిధర్, డాక్టర్ హరి ప్రసాద్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు డాక్టర్ జయరాంరెడ్డి, డాక్టర్ హిదాయుతుల్లాతో పాటు యూరాలజిస్టులు డాక్టర్ భరతరెడ్డి, డా. యశ్వంత్ మొదలగువారు కిడ్నీ ఆరోగ్యానికి సంబంధించిన నివారణ చర్యలపై సమగ్ర వివరణలను అందించారు.
టిఎక్స్ హాస్పిటల్స్ డైరెక్టర్లు డాక్టర్ కీర్తికర్ రెడ్డి డాక్టర్ దీపక్ రాజుతో పాటు రవీంద్ర రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. టి ఎక్స్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ వోడ్నాల, హాజరైన వారందరికీ కిడ్నీ ఆరోగ్యంపై అవసరమైన సమాచారాన్ని అనర్గళంగా తెలియజేశారు, టి ఎక్స్ హాస్పిటల్స్ కమ్యూనిటీ హెల్త్ వెల్‌నెస్ పట్ల నిబద్ధతను వివరించారు. టి ఎక్స్ హాస్పిటల్స్ యొక్క చొరవ ప్రజారోగ్య అవగాహనను ప్రోత్సహించడంలో దాని అచంచలమైన అంకితభావాన్ని సూచిస్తుంది సమాజానికి సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందించాలనే దాని లక్ష్యాన్ని నొక్కి చెబుతుంది

## రామంతాపూర్ లో పలు సంఘాల భవనాల నిర్మాణానికి రూ.1.30కోట్ల నిధులు మంజూరు - ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి

తెలంగాణవీణ,ఉప్పల్





రామంతపూర్ లో పలు సంఘాల భవనాల నిర్మాణానికి రూపాయలు 1, 30 కోట్ల నిధులు మంజూరు కుల సంఘాల ప్రతినిధులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన పరమేశ్వర్ రెడ్డి, రామంతాపూర్ లోని కుల సంఘాలు భవన నిర్మాణాలకు భారీగా నిధులు మంజూరు చేయించినట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.
సీఎం రేవంత్ రెడ్డి ఉప్పల్ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నట్టుగా చెప్పారు. అందులో భాగంగానే రామంతాపూర్ లోని కుల సంఘాల భవనాలకు సైతం నిధుల కేటాయింపు జరిగిందన్నారు.
1).రామంతాపూర్ అంబేద్కర్ సేవా సంఘం భవనానికి రూ.55 లక్షలు
2) రామంతాపూర్ గాంధీ నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 30 లక్షలు
3) రామంతాపూర్ రజక సేవా సంఘం శారదనగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.45 లక్షలు
ఆయా సంఘాల ప్రతినిధులకు పరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపట్టినట్టుగా తెలిపారు. కార్యక్రమంలో తౌఫిక్ ,సుర్వి మురళి గౌడ్ ,రఫీక్ ,తావిడబోయిన గిరిబాబు ,వల్లప్ప శ్రీకాంత్ యాదవ్ ,జలీల్ పశ ,సందీప్ ,భాస్కర్ పాల్గొన్నారు

## సీవరేజ్ పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి

తెలంగాణవీణ,ఉప్పల్





చర్లపల్లి డివిజన్, వి ఎన్ రెడ్డి నగర్ లో రూ .36లక్షల వ్యయం తో సీవరేజ్ పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంబించారు. ఎమ్మెల్యే మాట్లడుతూ నియోజకవర్గం లో అభివృద్ధి సంక్షేమానికి అధిక నిధులు ఖర్చుచేస్తున్నామని ,నియొజకవర్గం లో అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు, ప్రజాసంక్షేమం కొసం నిధులు తీసుకొచ్చి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తున్నామన్నారు , అభివృద్ధికి స్థానిక ఆధికారులు ,ప్రజాప్రతినిధులు సమన్వయము తో పనిచేయాలని సుచించారు .ఈ కార్యక్రమం తో డీజీమ్ సతీష్ ,ఏ ఈ రోహిత్ జిహెచ్ఎంసీ ఆధికారులు కాలనీ వాసులు ,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గోన్నారు,

## ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సమస్యలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి కి వినతి పత్రం



తెలంగాణవీణ,ఉప్పల్

మల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు శుక్రవారం ఎమ్మెల్యే ని కలిసి అక్కడి సమస్యలను వివరించారు బాలవికాస్ అనే సంస్థా వారు అబస్తీ లో గతం లో వాటర్ ప్లాంట్ నిర్మించారు ,ఇప్పుడు అ వాటర్ ప్లాంట్ నిరుపయోగముగా ఉండటంతో అ స్థలాన్ని కొంతమంది కబ్జాచేయాలని చూస్తున్నారని ,అక్కడ వాటర్ ప్లాంట్ తీసివేస్తే ఇప్పుడు అ స్థలం లో అంబేత్కర్ విగ్రహం ఎర్పాటు చేస్తామని తెలిపారు,గతం లో పలుమార్లు ఈ సమస్యలను సంబందిత అధికారులకు ,నాయకుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని తెలిపారు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పూర్తి చేయిస్తానని తెలిపారు ..

## పీర్జాదిగూడ కార్పొరేషన్ అభివృద్ధికి "1కోటి రూపాయల" స్పెషల్ ఫండ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి







తెలంగాణవీణ,ఉప్పల్

పిర్జాదిగూడ కార్పొరేషన్ అభివృద్ధికి 1 కోటి రూపాయల స్పెషల్ ఫండ్,పలు డివిజన్లలో కమ్యూనిటీ భవనాల నిర్మాణం,పలు మౌలిక సౌకర్యాల అభివృద్ధి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన తుంగతుర్తి రవి,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధి లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ 1కోటి రూపాయలు విడుదల చేసింది.
పీర్జాదిగూడ లోని
22 వ డివిజన్ బుద్దానగర్ లోని సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 8లక్షలు.
17వ డివిజన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 5 లక్షలు,
మేడిపల్లిలోని 15వ డివిజన్ క్రాంతి కాలనీ లో కమ్యూనిటీ హాల్ 8 లక్షలు.
10వ డివిజన్ లోని డ్వాక్రా బిల్డింగ్ నిర్మాణానికి 2 లక్షలు.
13వ డివిజన్ లో కమలానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 4లక్షలు.
3వ డివిజన్ లో సీసీ రోడ్ల నిర్మాణం 3 లక్షలు.
23వ డివిజన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 3లక్షలు.
8వ డివిజన్ లో బిబి సాహెబ్ మక్త రోడ్ no 5 నిర్మాణానికి 3 లక్షలు.
పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సరఫరా కొరకు హెచ్ ఎం డబ్లు ఎస్ కి (2,3,15 డివిజన్లకు ) 36 లక్షల రూపాయల నిధులను కేటాయించడం జరిగింది.నీటి సమస్యల గురించి హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఆఫీసర్ నిర్మల మేనేజర్ తిరుపతి తో చర్చించటం జరిగింది.ఈ అభివృద్ధిలో భాగంగా కమిటీ హాల్స్ నిర్మించే స్థలాలను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో మున్సిపల్ ఏ ఈ బిక్షపతి,మున్సిపల్ అధికారులతో పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మాట్లాడుతూ పీర్జాదిగూడ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించడం చాలా సంతోషకరమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కి సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డికి , మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి కి ,ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులకు పీర్జాదిగూడ కార్పొరేషన్ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి,నాగేష్, రంజిత్ రెడ్డి,పవన్ గౌడ్,మోహన్, జనగాచారీ,అయిలేష్ యాదవ్,సుధర్శన్ రెడ్డి,బుర్రె నాగరాజు, మనిరాం నాయక్,ఎన్ ఎన్ కే దుర్గ, ఉదయ్ రాజ్ గౌడ్, ఉప్పరి ఉదయ్ కుమార్, సుధీర్, విక్రమ్, శ్రీకాంత్ పటేల్,కపిల్,మహిళా అధ్యక్షురాలు శ్రీలత బద్రునాయక్,నంధిత గౌడ్, శారదా గౌడ్, దివ్య మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ప్రభంజనం ముందు ప్రతి పక్షాలు గల్లంతే - ఆంగోత్ ధర్మానాయక్

తెలంగాణవీణ,అచ్చంపేట



భారత దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పిన భారత ప్రధానీ సరేంద్ర మోదీ ప్రభంజనానికి దేశంలోని ప్రతి పక్ష పార్టీలు గల్లంతు కావాల్సిందేనని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోత్ ధర్మానాయక్ అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న బీజేపీ విజయ సంకల్ప సభకు ప్రధాని మోదీ హాజరవుతున్నారని, ఈసభకు జిల్లాలోని అన్ని నియోజక వర్గాలనుండి గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు అప దీపమైన మోదీ పాలనలో అనగారిన వర్గాలు అభివృద్ధిలో ముందుకు వెలుతున్నారన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్ కుమార్ గెలుపు నల్లేరుపై నడకేనన్నారు.

# మల్కాజిగిరిలో ప్రధాని మోదీ రోడ్ షో...

## కాషాయమయమైన మల్కాజిగిరి రహదారులు...






తెలంగాణవీణ, మల్కాజిగిరి

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం మిర్జాల్ గూడ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు నిర్వహించిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. రోడ్లన్నీ కాషాయమయంగా మారాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు ప్రధానీ రోడ్ షోకు తరలించిన జనంతో గల్లీలన్నీ కిక్కిరిశాయి. ప్రధాని నరేంద్ర మోదీని చూసేందుకు ప్రజలు తండోపతండాలు తరలివచ్చారు. ఎటూ చూసినా జనం రోడ్లపై మోదీ కోసం వేచిచూశారు. రోడ్లతోపాటు రహదారి పక్కనే ఉన్న భవనాలపై మోదీని చూసేందుకు ఉత్సహం చూపించారు. చిన్నారుల నుంచి ముసలివాళ్లు సైతం మోదీ రోడ్ షోను తిలకించేందుకు విచ్చేశారు. మోదీ రోడ్ షో సుమారు గంట పాటు మిర్జాల్ గూడ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు 1.2 కిలోమీటర్ల మేర సాగింది. రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తూ సాగింది. అభిమానులు, కార్యకర్తలు మోదీపై పూల వర్షం కురింపించారు. రోడ్ షోలో మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్ తో పాటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు....

- ప్రధాని మోదీ రోడ్ షో కారణంగా మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.
- పోతరాజుల వేషదారణలు రోడ్ షోలో విశేషంగా అకట్టుకున్నాయి.
- బారికేడ్లు ఏర్పాటు చేసి రహదారులపై ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టారు.
- మల్కాజిగిరి, ఈస్టు ఆనంద్ బాగ్, జెడ్ టీఎస్, మిర్జాల్ గూడ, గౌతంనగర్, మినిట్యాంక్ బండ్, నేరేడ్ మెట్ ప్రాంతాల్లోని ట్రాఫిక్ మళ్లించారు.
- మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లోని గల్లీలన్ని బీజేపీ శ్రేణులతో కిక్కిరిపోయాయి.
-ప్రధాన రహదారి పక్కన వాణిజ్య సముదాయాలను మూసివేశారు.
- మోదీ నినాధాలతో మల్కాజిగిరి పరిసర ప్రాంతాలు మార్మోగాయి.
- బీజేపీ శ్రేణులు, పార్టీ నాయకులు గల్లీలకే పరిమితమైయ్యారు.
- మల్కాజిగిరి చౌరస్తాలో మోదీకి ఘనస్వాగతం పలికేందుకు జనం పోటీపడ్డారు.
- జనం సెల్ ఫోన్లు మోదీ ఫోటోలు, రోడ్ షో విడియోలతో బిజీగా మారాయి.
-పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మోదీ రోడ్ షో ప్రాధాన్యత సంతరించుకుంది.

# వినియోగదారుల హక్కులు, చట్టాల పై ప్రజల్లో అవగాహన పెరగాలి

ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సభలో జిల్లా జాయింట్ కలెక్టర్, లావణ్య వేణి





తెలంగాణవీణ,ఏలూరు

వినియోగదారుల హక్కులను రక్షించేందుకు నిర్దేశించిన బలమైన, స్పష్టమైన చట్టాలపై ప్రజలకు అవగాహన కలిపించే భాధ్యత నేటి యువతరంపై ఉందని జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లెయి అధికారి ఆర్.ఎస్.ఎస్. రాజు శుక్రవారం స్థానిక సి ఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడియో విజువల్ హాల్ నందు నిర్వహించిన కార్యక్రమంలో జెసి లావణ్య వేణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి స్పష్టంగా తెలుసుకుంటే మోసాలు చిన్నవైన, పెద్దవైన సరైన న్యాయాన్ని పొందటానికి అవకాశం దక్కుతుంద న్నారు. సమాజంలో ప్రతి వినియోగదారుడు తమ హక్కుల తో పాటు భాద్యతలు తెలుసుకోవాలన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం పటిష్టంగా అమలు కావడంపై అవగాహన కల్పిస్తామన్నారు.

వినియోగదారులకు రక్షణ కోసం కల్పించబడిన ప్రయోజనాలను వారు నష్టపోకుండా వినియోగదారు ల సంక్షేమ ఉద్యమకారులు ప్రజలను చైతన్య పరచవలసిన భాధ్యత వుందన్నారు. వినియోగదారులు తమ హక్కులను పొందేందుకు అవసరమైన యంత్రాంగం వుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం 2019 కొత్త వినియోగదారుల హక్కుల చట్టం వచ్చిందని దీనిలో ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికపరమైన విజ్ఞానాన్ని పొందిపరిచారన్నారు.

వినియోగదారుడు ఏ వస్తువు కొన్నా, ఏ సేవ పొందినా అది వినియోగదారునికి ఉపయోగ పడాలే కానీ హాని కలిగించరాదని , వాటి వలన పూర్తి భద్రత ఉండాలని పేర్కొన్నారు. నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల కొరకు న్యాయమైన మరియు బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు అనే విషయాన్ని ఇతివృత్తంగా తీసుకోవడం జరిగిందని తెలిపారు.

ఈ-కామర్స్ , ఆన్లైన్ అమ్మకాలు, కొనుగోళ్ళ లో జరుగుతున్న మోసాలు అరికట్టబడతాయన్నారు. విద్యా సంస్థల్లో కూడా కన్స్యూమర్ క్లబ్ లను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఈ చట్టం పని తీరు , చట్టం లోని అంశాల పై అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. విద్యతోపాటు విద్యార్ధులు స్కిల్ నైపుణ్యాన్ని కలిగియుండాలని తెలిపారు.

కార్యక్రమం లో పాల్గొన్న వినియోగదారుల ఫోరంనకు చెందిన కన్స్యూమర్ జిల్లా ప్రెసిడెంట్ మరియు న్యాయవాదియైన కట్టా సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ న్యాయవాది రామానుజాచార్యులు, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ సభ్యురాలు న్యాయవాది నాగలక్ష్మి, డాక్టర్ విజయ్ కృష్ణ, తదితరులు మాట్లాడుతూ వినియోగదారులకు కొనుగోలులో నష్టం వాటిల్లితే సంబంధించి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన పలు అంశాలను పైన ఇన్స్యూరెన్స్ భద్రతా హక్కు బిల్లు తీసుకోవడం ధర, నాణ్యత పరిణామం పై ప్రశ్నించే హక్కు కలిగి ఉండడం ఉత్పత్తి చేసే వారే జవాబుదారుడవుతాడని తదితర అంశాలపై వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణిని వినియోగదారుల ఫోరం సభ్యులు సన్మానించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ చేతులమీదుగా కన్స్యూమర్ జిల్లా ప్రెసిడెంట్ మరియు న్యాయవాదియైన కట్టా సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ న్యాయవాది రామానుజాచార్యులు, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ సభ్యురాలు న్యాయవాది నాగలక్ష్మి, డాక్టర్ విజయ్ కృష్ణ వారిని సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వినియోగదారులు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీఏలూరు పార్లమెంటు ఇంచార్జ్ గా కావూరు లావణ్య ను నియమించాలి.

తెలంగాణవీణ,ఏలూరు



ఏలూరు పార్లమెంట్ ఇంచార్జ్ గా కాంగ్రెస్ పార్టీ కావూరి లావణ్య నీ నియమిస్తే బాగుంటుందని కొందరి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల మార్చి 10వ తారీఖున చింతలపూడి మండలం చింతలపూడిలో బాబు జగజీవన్ రావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కావూరి లావణ్య ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు. ఈ కార్యక్రమానికి భారీ ర్యాలీ ఏర్పాటు చేయగా ర్యాలీలో కావూరి లావణ్య ప్రజలకు అభివాదం చేస్తూ అందర్నీ ఆప్యాయతగాపలకరిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కావూరి లావణ్య నీ గుర్తించి పార్లమెంటు ఇంచార్జ్ గా నియమిస్తే. కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం అని కొందరు విశ్లేషకులు. మరియు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఈడీ సోదాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు



తెలంగాణవీణ,హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఈడీ సోదాల అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఇది బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ కావొచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసినప్పుడే కవితను కూడా అరెస్ట్ చేయాల్సిందని వ్యాఖ్యానిచారు. కానీ ఇప్పుడు కవిత అరెస్టుతో రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఓట్లు సాధించేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు.అంతకుముందు బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు కవిత అరెస్ట్ గురించి మాట్లాడారని గుర్తు చేశారు. రేపే అరెస్ట్ అంటూ తెలంగాణ బీజేపీ నేతలు మాట్లాడారని... కానీ అప్పుడు ఏమీ జరగలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గల్లీలో కొట్లాడుకుంటూ ఢిల్లీలో మాత్రం దోస్తులుగా ఉన్నారని విమర్శించారు.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేల్దాం..
తెలుగు దినపత్రిక

# మాయ మాటలతో నట్టేట ముంచాడు.
## పది పెడితే వంద వస్తాయని ఆశ చూపి
# కుచ్చుటోపి

తెలంగాణవీణ,అచ్చంపేట




తెలంగాణ వీణ /అచ్చంపేట, ఆయుర్వేద మందుల తయారీలో 10 రూపాయలు పెట్టు బడి పెడితే వంద రూపాయలు వస్తాయని ఆశ చూపి మామాటలతో డబ్బులు పెట్టు బడి రూపంలో పెట్టి ఉడాయించిన సంఘటన అచ్చంపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది, నల్లగొండ జిల్లాకు చెందిన నర్సిరెడ్డి ఆయుర్వేదిక్ మందుల విక్రయం పేరుతో తన్విత ఆయుర్వేదిక్ విక్రయ సెంటర్ ను గత కొన్ని రోజుల క్రితం అచ్చంపేటలో ఏర్పాటు చేశాడు. దీంతో ఈప్రాంతంలోని కొందరితో పరిచయాలను పెంచుకుని మరో నలుగురితో కలిసి వ్యాపారం విస్తరించాడు. ప్రజలలో నమ్మకం కలిగించి ఆయుర్వేదిక్ మందుల తయారీలో పెట్టుబడులు పెడితే పది రూపాయలకు వంద రూపాయలు వస్తాయని నమ్మించి అచ్చంపేట పరిసర ప్రాంతాలకు చెందిన వారినుండి దాదాపు 16 కోట్ల రూపాయలు వసూలు చేసుకుని, కొన్ని రోజులకే ఇక్కడి నుండి ఉడాయించాడు. ఎన్ని రోజులైన తమ పెట్టుబడి డబ్బులు వస్తాయని ఆశతో ఉన్న బాదితులు నర్సి రెడ్డి నుండి ఎలాంటి రెస్పాన్స్ లేక పోవడంతో అచ్చంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాదితుల కార్తీక్ తోపాటు మరో నలుగురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ రాము తెలిపారు.

# పద్మశాలీల జీవితాలలో వెలుగులు నింపుతున్న ప్రభుత్వం
## - కోట కిషోర్

తెలంగాణవీణ,అచ్చంపేట



అన్ని రంగాలలో వెనుకబడిన పద్మశాలీలను ఆదుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి జీవితాలలో వెలుగులు తెచ్చేందుకు కృషి చేస్తున్నాడని పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిషోర్ అన్నారు. ఇప్పటివరకు ఉన్న కార్పొరేషన్లు కేవలం చేనేత ఆధారంగా ఉన్న పద్మశాలి, చేనేత కుటుంబాలకి మాత్రమే అందుబాటులో ఉండేవనీ,పద్మశాలి జనాభాలో అత్యధిక శాతం చేనేత వృత్తి వెలుపల ఉన్నారన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసం పలు చర్యలు తీసుకోవలసిందిగా గత ప్రభుత్వాలను అభ్యర్థించినా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదనీ రాష్ట్ర ప్రభుత్వం వృత్తి వెలుపల ఉన్న పద్మశాలీల ఆర్థిక,సామాజిక అభివృద్ధి కొరకు పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం తో పద్మశాలి లా బ్రతుకులు మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సుమారు 30 లక్షల మంది పద్మశాలీలకు ఒక భరోసగా పని చేస్తుందన్నారు. . పద్మశాలి కార్పొరేషన్ పద్మశాలి కుల బంధువులకి, ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తామన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అచ్చంపేటశాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ పద్మశాలిలు ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు .

# జలమండలి ప్రధాన కార్యాలయంలో ఏసీబీ దాడులు
## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ ,ఔట్ సోర్సింగ్ ఉద్యోగి



తెలంగాణవీణ,హైదరాబాద్

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన జలమండలి ఉద్యోగులు. ఖైర్ తాబాద్ లోనీ జలమండలి ప్రధాన కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం మధ్యానం మూడుగంటల ప్రాంతంలో దాడులు నిర్వహించి ప్రభుత్వ ఉద్యోగి తో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అరెస్టు చేశారు . పూర్తి వివరాల్లోకి వెళితే.. జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ రెవెన్యూ సర్కిల్ కార్యాలయం లో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ సెక్షన్ లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఎల్.రాకేష్ వాటర్ ట్యాంకర్లకు సంబంధించి నగరానికి చెందిన అక్బర్ హుస్సేన్ జనవరి, ఫిబ్రవరిలో పెండింగ్లో ఉన్న బిల్లుల తో పాటు రెన్యూవల్ కు కూడా ఫిర్యాదుదారు యొక్క లీజు లైసెన్సు క్లియర్ చేయడానికి గాను లక్షా రూపాయలు తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన సందీప్ నీ కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో హైదరాబాద్ ఏసీబీ సిటీ రేంజ్ –I యూనిట్ ఆధికారులు ల బృందం పాల్గొంది. జలమండలి ప్రధాన కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో ఉద్యోగులు తీవ్ర అయోమయానికి గురయ్యారు. జలమండలి నూతన ఎండీగా సుదర్శన్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాన కార్యాలయంలో ఏసీబీ దాడులు జరుగడం ఇదే ప్రదమం.ఇది ఇలా ఉండగా జలమండలి ఓ అండ్ ఏం కు సంబంధించిన డివిజన్ –6ఎస్ఆర్ నగర్, 9కూకట్ పల్లి,12 ఇదిపిఏల్, 15 మాదాపూర్ పరిధిలో వాటర్ ట్యాంకర్ల సరఫరాకు సంబంధించిన ట్యాంకర్ల ఇంచర్జులుగా వ్యవహరిస్తున్న ఉద్యోగుల ద్వార అవకతవకలు జరిగాయని , దానికి సంబంధించిన పూర్తి నివేదికలు కూడా జలమండలి ఎండి కి అందినట్లు సమాచారం. ట్యాంకర్ల విషయంలో సంబంధిత డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ట్యాంకర్ల ఇన్ చార్జులుగా వ్యవహరిస్తున్న ఉద్యోగుల ప్రమేయం కూడా ఉండ వచ్చని బోర్డు అధికారులు గుర్తించి జలమండలి చర్యలు తీసుకునే క్రమంలో ఏసీబీ అధికారుల దాడులు జరుగడం బోర్డులో హాట్ టాపిక్ గా మారింది.

# హబ్సిగూడ లో మల్కాజిగిరి బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డికి అవకాశం

తెలంగాణవీణ,ఉప్పల్



ఉప్పల్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేసిన రాగిడి లక్ష్మారెడ్డి కి ఎంపి గా అవకాశం ఇవ్వడం శుభ పరిణామమని , భారీ మెజారిటీతో రాగిడి లక్ష్మారెడ్డి ఎంపిగా విజయంసాధిస్తారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు, దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గం అయిన మల్కాజిగిరి నుండి బిఆర్ఎస్ పార్టీ ఎంపి గా అవకాశం ఇవ్వడం పట్ల కేసీఆర్ , కేటీఆర్ , హరీష్ రావు లకు రాగిడి లక్ష్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు, పార్లమెంట్ ఎన్నికలలో ఎమ్మెల్యే లు అందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో ఉంటూ మల్కాజిగిరి పార్లమెంట్ లో విజయకేతనం ఎగుర చేస్తానని రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ప్రభుదాస్ , దేవేందర్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ నాయకులు బన్నాల ప్రవీణ్ , అరటికాయల భాస్కర్ , ఆకుల మహేందర్ డిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు డివిజన్ ప్రెసిడెంట్లు మహిళా నాయకురాలు ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు ..

# జిల్లా ఎస్పీ కార్యాలయం నందు నేర పరిశోధన సమీక్ష సమావేశం

తెలంగాణవీణ,ఏలూరు




ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీమతి డి మేరీ ప్రశాంతి ఐపీఎస్ వారు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో ఏలూరు జంగారెడ్డి గూడెం పోలవరం మరియు నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని అందరూ డిఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎస్ఐ లతో నేర సమీక్షా సమావేశం నిర్వహించినారు★
ఈ నేర సమీక్ష సమావేశం లో జిల్లా ఎస్పీ గారు పెండింగ్ లో ఉన్న గ్రేవ్ మరియు నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 Crpc కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు మరియు ఇతర కేసులను సమీక్షించారు.
ఏలూరు జిల్లా నేర సమీక్ష సమావేశం నకు ముఖ్య అతిది గా పాల్గొన్న ఏలూరు రేంజ్ ఐజి గౌరవ శ్రీ జి వి జి అశోక్ కుమార్ ఐపీఎస్ వారు అధికారులతో గౌరవ ఐ.జి గారు మాట్లాడుతూ
రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, శాంతియుతంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే లాగా ప్రణాళికల ను సిద్ధం చేసుకోవాలని,
ప్రతి ఒక్కరూ ఎలక్షన్ కమిషన్ వారి యొక్క కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ తప్పనిసరిగా ఉద్యోగ నిర్వహణ చేయాలని,
ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు అందరూ అలసత్వం లేకుండా ఉద్యోగ నిర్వహణ చేయాలని,
పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ట్రైబల్ మాగర్స్, గత ఎన్నికల సమయములో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి ఉన్న వారిని ముందుగా బైండ్ ఓవర్ చేసి వారి యొక్క కదలికల పై నిఘా ఉంచాలి అని,
అధికారులు అందరూ ఎన్నికలు సజావుగా సాగేందుకు ముందుగానే సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి అని, సదరు ప్రాంతాలలో ప్రత్యేక అధికారులను నియమించి, సాయుధ దళాల తో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి, ప్రజలు వారి యొక్క ఓటు హక్కు ను స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకునే లాగా భరోసాను కల్పించాలి అని,
ప్రతి అధికారి కొత్త చట్టాల పట్ల అవగాహనను కలిగి ఉండాలని అని, ఒంగోలు పి.టి.సి వారు నిర్వహించే జూమ్ వీడియో కాన్ఫరెన్స్ లో చట్టాల పట్ల అవగాహనను కలిగి ఉండాలని తెలియ చేసిన ఏలూరు రేంజ్ ఐజి గారు.
ఈ నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ శ్రీమతి జి స్వరూప రాణి గారు, ఎస్.బి ఇన్స్పెక్టర్ లు మల్లేశ్వర రావు గారు అది ప్రసాద్ గారు డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బా రావు గారు ఏలూరు, జంగారెడ్డి గూడెం పోలవరం మరియు నూజివీడు డీఎస్పీలు, ఇన్స్పెక్టర్ లు, సిఐ లు,ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు... ఎంప్లాయిస్ గ్రీవెన్స్ లో 14
# అర్జీలు స్వీకరణ...





తెలంగాణవీణ,ఏలూరు

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి తో కలిసి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగుల నుండి విజ్ఞాపనలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉన్న సర్వీస్ సమస్యలు పరిష్కారం అయితే వారు మరింత స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేయడానికి దోహదపడుతుందన్నారు. ఉద్యోగుల సర్వీసు మేటర్స్, పెన్షన్ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు, తదితర సమస్యలపై విజ్ఞాపనలను ఉద్యోగుల గ్రీవెన్స్ నందు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈరోజు నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో 14 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె. కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కట్టుదిట్టంగా పదో తరగతి పరీక్షలు



తెలంగాణవీణ,ఏలూరు

ఈనెల 18వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా, నిస్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశ మందిరంలో వివిధ శాఖల సిబ్బందితో పదో తరగతి పరీక్షలు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 10 వ తరగతి పరీక్షలకు మొత్తం 32,355 మంది హాజరుకానున్నారని, వీరిలో బాలురు 16,760 మంది, బాలికలు 15,595 మంది ఉన్నారని, వీరిలో రెగ్యులర్ విద్యార్థినీ విద్యార్థులు 24,125 మంది అని అలాగే ప్రైవేట్ విద్యార్థిని విద్యార్థులు మొత్తం సంఖ్య 8,230 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాలో 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు పరీక్షలు రోజుమార్చి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులను 8.45కు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. అలాగే పరీక్ష సమయం పూర్తయిన పిదపే బయటకు వదలడం జరుగుతుందన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. సరిగ్గా ఎన్నికల ముందు నిర్వహించే పదవతరగతి పరీక్షలను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి ఎటువంటి పొరబాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్ పి (ఏ ఆర్)ఎన్ ఎస్ ఎస్ శేఖర్,జిలా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం, డిఎంహెచ్ వో డాక్టర్ ఎస్ . శర్మిష్ట ఉప రవాణా కమిషనర్ శాంత కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి, విద్యుత్ శాఖ ఎస్ ఈ సాల్మన్ రాజు, కలెక్టరేట్ ఏవో కె.కాశీ విశ్వేశ్వరరావు,జిల్లా ప్రజా రవాణా అధికారి వరప్రసాదరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జి ఎస్.పి.బి. కుమార్,జడ్పీ డిప్యూటీ సీఈవో ఎస్.నిర్మల జ్యోతి,పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏపిపిఎస్సీ గ్రూప్ వన్ పరీక్షలు పగడ్బందిగా నిర్వహించాలి..



తెలంగాణవీణ,ఏలూరు

ఏలూరు జిల్లాలో మార్చి 17న నిర్వహించే ఏపిపిఎస్సీ గ్రూప్ వన్ పరీక్షకు 4372 హాజరుకానున్నారని గ్రూప్ వన్ జిల్లా సమన్వయ అధికారిని మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లో గౌతమి సమావేశ మందిరంలో ఏపిపిఎస్సీ గ్రూప్ వన్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్షకు నియమించిన ఛీఫ్ సూపరింటెండెంట్ , లైజన్ ఆఫీసర్స్, రూటు ఆఫీసర్స్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ బి లావణ్య వేణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 17న నిర్వహిస్తున్న ఏపిపిఎస్సి గ్రూప్ వన్ పరీక్షకు జిల్లాలో4372 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు 5 సెంటర్లు ఏర్పాటు చేసామని, ఈ ఐదు గంటలకు ఐదుగురు లైసెన్ ఆఫీసర్ను నియమించామని చెప్పారు. వీటిలో సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ కి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా. జి. నెహ్రూ బాబు ను, సి ఆర్ రెడ్డి బాలికల డిగ్రీ కళాశాల కు సెట్వెల్ సీఈఓ హెచ్ మహారాజ్ ను, సి ఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కు, జిల్లా ఉపాధి అధికారి సి. మధుసూదన్ రావు ను, రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజ్ కు ఏపీ జి ఎల్ ఐ డిప్యూటీ డైరెక్టర్ కే. శ్రీనివాస్ వరప్రసాద్ ను, సిహెచ్ ఎస్. డి .ఎస్ .టి. దేరిసా మహిళ డిగ్రీ కాలేజ్ కు జిల్లా మత్స్యశాఖ అధికారి కే ఎస్. వి. నాగలింగేశ్వర లైజన్ ఆఫీసర్గా నియమించినట్లు తెలిపారు.ఈ పరీక్షలు ఉదయం10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00గంటల వరకు , మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్ తోపరీక్షకు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను పరీక్షా సమయం దాటితే పరీక్షకు అనుమతించరని చెప్పారు. ఈ పరీక్షా నిర్వహణకు సీటింగ్ ఏర్పాట్లు, వెన్యూ కోడ్ నెంబరు, హాల్ టిక్కెట్ పరిశీలన జవాబు పత్రాలు, ఇన్విజియేటర్ సంతకం తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో ఏలూరు ఆర్డీవో ఎన్ .ఎస్ కే .ఖాజావల్లి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ లు జి. అశోక్, ఎం. విజయకుమార్, పరీక్ష చీఫ్ సూపర్డెంట్లు మరియు కాలేజీ ప్రిన్సిపల్ కే .వెంకటేశ్వరరావు, ఎస్. అనురాధ, ఏ .శివకుమార్,
కే శ్రీరాములు, ఏ. పద్మ వతి, కలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వరరావు, రూట్ ఆఫీసర్స్, సంబంధిత ఆర్టీసీ, పోలీస్, ఎలక్ట్రికల్, కలెక్టరేట్ సెక్షన్ సూపర్డెంట్లు తదితరులు పాల్గొన్నారు

# పనిచేసే వ్యక్తి ని పార్లమెంటుకి పంపాలి
## - సీతారామాంజనేయ చౌదరి ఆకాంక్ష



తెలంగాణవీణ,ఏలూరు

ఏలూరు పార్లమెంట్ స్థానానికి అర్హులైన వ్యక్తిగా తపన చౌదరి ని ప్రజలు ఆదరిస్తున్నారని పార్టీ అధిష్టానం గుర్తించి ఎంపీ స్థానం ఇవ్వాలని తపన ఫౌండేషన్ అధినేత బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఏలూరు క్రాంతి కళ్యాణ మండపం లో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తపన సంస్థ ద్వారా అనేక సేవలు ప్రజలకు చేశామని అన్నారు. కుటుంబం సమాజ సేవకు అంకితం అయ్యామని పేర్కొన్నారు. బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా క్రమశిక్షణ నిబద్ధత కలిగి నడుచుకుంటున్నానని కార్యకర్తలకు దగ్గరగా ఉంటూ వారి మనోధైర్యానికి కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రసంగించారు. ప్రముఖ పరిశ్రమకు వేత్త అంబికా కృష్ణ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా సేవలందించిన గారపాటి చౌదరికి ఏలూరు పార్లమెంట్ సీటు ఇవ్వాలని అధిష్టానం దీనిని గుర్తించాలని కోరారు. అనంతరం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పార్టీ నేతలు కార్యకర్తలు తమ అభిప్రాయాలను తెలియజేశారు ఏలూరు పార్లమెంటు పరిధిలో ఉన్నటువంటి పలు గ్రామాల నుండి వేల సంఖ్యలో ప్రజానీకం ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యారు.

# కోస్టల్ బ్యాంక్ జిల్లా సైనిక సంక్షేమ నిధికి లక్ష రూపాయల వితరణ.
## బ్యాంక్ అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్...




తెలంగాణవీణ,ఏలూరు

దేశ రక్షణకోసం కర్తవ్యనిష్టతో సేవలందించిన మాజీ సైనికులను ఆదుకోవడం మనందరి విధిఅని వారికి చేయూతనందించడం విద్యుక్తధర్మమని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. విజయవాడ ప్రధాన కార్యాలయంగా గత 25 సంవత్సరాల నుండి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కోస్టల్ బ్యాంక్ తమ సామాజిక బాధ్యతలో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ వారి చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ నిధికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ కోస్టల్ బ్యాంక్ సిసిఓ వై. సత్యనారాయణ, ఇతర బ్యాంక్ అధికారులను అభినందించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మాజీ సైనికులు, సైనిక కుటుంబాలను ఆదుకునే అవకాశాన్ని కోస్టల్ బ్యాంక్ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కోస్టల్ బ్యాంక్ సిసిఓ వై. సత్యనారాయణ మాట్లాడుతూ తమ బ్యాంక్ రూ. 750 కోట్ల డిపాజిట్లు కలిగి, రూ. 625 కోట్ల లోన్సుతో 50 శాఖల ద్వారా అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండటమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ క్లస్టర్ హెడ్ టి. రామకృష్ణ, బ్రాంచి మేనేజరు ఎంఏఎల్ మాధురి, జిల్లా సైనిక సంక్షేమాధికారి కె.వి. సాయి ప్రసాదరావు పాల్గొన్నారు.

# వైయస్ఆర్ సీపీలో చేరిన కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం

తెలంగాణవీణ,ఏలూరు



కాపుల ఆశయాల దిశగా అడుగులు వేస్తున్నది సీఎం జగన్ మాత్రమే అని ముద్రగడ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. తాడేపల్లి లో శుక్రవారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి జగన్ను ముద్రగడ పద్మనాభం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరి వైయస్ఆర్ సీపీలో చేరారు. ఈ మేరకు సీఎం జగన్ వారికి వైయస్ఆర్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాపు సామాజిక వర్గ అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్ కృషిని పురస్కరించుకుని కాపు నేత ముద్రగడ పద్మనాభం వైఎస్సార్సీపీలో చేరారు..ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాపు సామాజికవర్గం వైఎస్సార్సీపీకి మద్దతిచ్చి కాపుల ఆకాంక్షలు నెరవేరేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు (తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు), ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.